
# బీజం



పాలకూర సీతాలత

'బాల విద్యామందిర్.'

మెయిన్ రోడ్డుకి కాస్త దూరంగా, పది ఎకరాల భూమిలో ఆట స్థలం, వ్యాయామశాల ఆడిటోరియం, లైబ్రరీ వంటి అన్ని సదుపాయాలతో అత్యాధునికమైన బిల్డింగుల నడపబడుతున్న ప్రైవేటు స్కూలు అది ప్రారంభించబడిన అనతికాలంలోనే అందర్నీ ఆకట్టుకోగలిగింది అంటే ఆశ్చర్యం లేదు. బాల బాలికలకు ఉన్నత విద్యా ప్రమాణాలు అందించడమే కాకుండా, వారిలో సరైన నైతిక ప్రవర్తన పెంపొందించడానికి కంకణం కట్టుకున్న స్కూలు అది. అందులో పని చేసే టీచర్లందరూ ఆణిముత్యాలు. చిత్తశుద్ధి కలవారు. ఏదో మొక్కుబడిగా క్లాసులో పాఠం చదివేసి ఆ పాఠం చెప్పడం అయిందనిపించి, ఇంకా అర్థం కాకపోతే గైడ్లు చూసి చదువుకోండని చెప్పే టీచర్లు లేరు అక్కడ.

ఆ స్కూలు ప్రిన్సిపాలు డాక్టరు పరమేష్ఠి. బాలబాలికల మానసిక ప్రవృత్తిమీద డాక్టరేట్ చేశారు. ఆయనను ఏరి కోరి ఆ స్కూలుకి ప్రిన్సిపాలుగా వేశారు. ఆయన హయాంలో ఆ స్కూలు దినదినాభివృద్ధి చెందిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆయన తరుచుగా టీచర్లు పాఠాలు చెపుతున్నప్పుడు క్లాసులోకి వెళ్ళి విద్యార్థులు కూర్చునే బెంచీల్లో విద్యార్థులతో పాటు కూర్చుని టీచరు ఏ రకంగా చెపుతున్నాడో గమనిస్తారు. ఆ టీచర్‌లో ఏమైనా లోటుపాట్లు ఉంటే ఆ టీచరును ఒంటరిగా కలుసుకుని ఆ విషయం చెప్పి ఏ రకంగా అభివృద్ధి చేసుకోవాలో చెపుతారు.

అలాంటి స్కూలు ఆ ఊళ్ళో ఉండటం ఒక రకంగా ఆ ఊరి ప్రజలు చేసుకున్న అదృష్టం. అది నిజంగా విద్యామందిరమే!

** ** **

ఆ రోజు విద్యార్థుల ఆటవిడుపు సమయంలో వరండా దగ్గర నాలుగవ తరగతి చదువుకునే ఇద్దరు విద్యార్థులు కుస్తీ పడుతున్నారు.

"ఇచ్చెయ్యి...నా పెన్సిలు ఇచ్చెయ్యి నాకు చెప్పకుండా ఎందుకు తీసుకున్నావు?" అన్నాడు ఒకడు.

"పోవోయ్...అది నీది కాదు...నాదే..." అన్నాడు మరొకడు.

ఏదో పనిమీద అటుగా వెళుతున్న పరమేష్ఠిగారు అంతా చూశారు.

"ఏయ్...ఏమిటది?" అన్నారు కాస్త గట్టిగా.

ఆ పిల్లలు ఇద్దరూ దెబ్బలాడుకోవడం మానేసి, పక్కపక్కగా నిలబడి భయంగా చూశారు పరమేష్ఠిగారివైపు. ఆయన ఆ పిల్లలు ఇద్దర్నీ ఆప్యాయంగా భుజంమీద చేయివేసి దగ్గరకు తీసుకున్నారు. దాంతో ఆ పిల్లలిద్దరికీ కొంచెం ధైర్యం వచ్చింది.

ప్రతి క్లాసులో ప్రతి పిల్లవాణ్ణీ గుర్తు పట్టగలరు ఆయన.

"ఏరా గోపీ...ఏమిటి సంగతి...రాము పెన్సిల్ దొంగిలించావా?"

"లే...లేదు సార్!"

రాము అన్నాడు.

"గోపీ అబద్ధం చెపుతున్నాడు సార్! ఆ పెన్సిల్ నాదే..."

వరండాలో పంచాయతీ పెట్టడం నచ్చలేదు పరమేష్ఠిగారికి.

"పదండి...నా రూమ్‌కు వెళ్దాం..." అన్నారు. ముగ్గురూ అక్కడి నుంచి కదిలారు.

గోపీకి మనసులో బిక్కుబిక్కుమంటోంది. పరమేష్ఠిగారు తన కుర్చీలో కూర్చున్నారు. గోపీని దగ్గరకు పిలిచారు.

"గోపీ...నువ్వు పెన్సిలు దొంగతనం చేస్తే ఆ విషయం ఒప్పుకో. అప్పుడు నువ్వు ఒక్క తప్పే చేసినట్లు అవుతుంది. దొంగతనం చేసిన తరువాత చేయలేదంటూ బుకాయిస్తే నువ్వు రెండు తప్పులు చేసినట్లు. దొంగతనానికి తోడు అబద్ధం కూడా ఆడడం. ఒక రకంగా చెప్పవలసివస్తే రెండో తప్పు మొదటి తప్పుకంటే ఘోరమైనది. నువ్వు భయపడవలసిన అవసరం లేదు. నిజం చెప్పు..." అన్నారు.

"లేదు సార్... నేను పెన్సిలు తీసుకోలేదు..." అన్నాడు గోపీ.

"ఏరా రామూ ! నీ పెన్సిలు ఈ గోపీ తీశాడని ఎలా తెలుసు? వాడు దొంగతనం చేస్తుండగా నువ్వు చూశావా?"

"సార్...గోపీ దొంగతనం చేస్తుండగా నేను చూడలేదు కానీ నా పెన్సిలు గోపీ తీశాడు? కచ్చితంగా చెప్పగలను."

"ఎలా?"

రాము తన జేబులోంచి పెన్సిలు తీశాడు. పెన్సిలు చివర్లో బ్లేడుతో 'ఆర్' అన్న అక్షరం చెక్కి ఉంది.

"నా పెన్సిళ్ళు అన్నింటిమీదా ఇలా 'రాము'లో మొదటి అక్షరం 'ఆర్' చెక్కుకుంటాను. గోపీ జేబులో ఉన్న పెన్సిలు చూడండి. దానిమీద కూడా 'ఆర్' అక్షరం ఉంటుంది..." అన్నాడు రాము.

పరమేష్ఠిగారు తల పంకించారు.

"గోపీ...నీ పెన్సిలు చూపించు..."

భయం భయంగా జేబులోంచి పెన్సిలు తీసి ఆయనకు అందించాడు గోపీ. దానిమీద రాము చెప్పినట్లు 'ఆర్' అక్షరం ఉంది.

"నిజం చెప్పు గోపీ... నా సహనం పరీక్షించకు. చెడ్డపనులు సహించలేను నేను. నిజం చెప్పావంటే నీకు విధించబోయే శిక్ష కొంచెం తగ్గుతుంది" అన్నారు పరమేష్ఠిగారు గట్టిగా.


గోపీ కళ్ళలో నీళ్ళు.

"సార్... నన్ను క్షమించండి... గోపీ బాక్సులోంచి పెన్సిలు నేను తీసుకున్నాను...' అన్నాడు.

"ఎందుకని?" అన్నారు పరమేష్ఠిగారు వీలైనంత శాంతంగా.

"నిన్న నా పెన్సిలు అయిపోయింది. కొత్తది కావాలని ఇంట్లో అమ్మకు చెప్పాను. ఆ తరువాత నాన్నకు చెప్పాను. ఇద్దరిలో ఎవ్వరూ పట్టించుకోలేదు. కొత్త పెన్సిలు తీసుకుని రాకపోతే ఊరుకోనని నిన్ననే లెక్కల మాస్టారు చెప్పారు. ఆయనంటే నాకు చాలా భయం. కొత్త పెన్సిలు లేనందుకు ఎక్కడ ఆయన నన్ను కొడతారో అని భయపడుతూ స్కూలుకి వచ్చాను. నా పక్కనే కూర్చుండే రాము దగ్గర రెండు పెన్సిళ్ళు చూశాను. ఒకటి ఇయ్యమని అడగాలనుకున్నాను కానీ, ఇయ్యడేమో అనిపించింది. అందువల్ల వాడు చూడకుండా..." అన్నాడు గోపీ గడగడా పాఠం ఒప్పచెపుతున్న పద్ధతిలో.

గోపీ కలవారి అబ్బాయి. అతనికి దొంగతనం చేయవలసి రావడానికి ఒక రకంగా కారణం



ఫోటో: నటేష్

అతని తల్లితండ్రులు. పెన్సిలు కావాలని అడిగితే వాళ్ళు ఎందుకని కొని ఇయ్యలేదు? వరమేష్టిగారి మనసులో సందేహం కలిగింది. ఆ మాట గోపీనే అడిగారు. గోపీ వివరంగా చెప్పాడు.

** ** **

గోపీ స్కూలు నుంచి ఇంటికి వచ్చేసరికి నాలుగు అయింది. పుస్తకాల సంచీ అల్మారాలో పెట్టుకుని, బూట్లు విప్పుకుని, స్కూలు యూనిఫాం మార్చుకుని, కాళ్ళు కడుక్కున్నాడు. వంటమనిషి గ్లాసులో బోర్నవిటా కలిపి తీసుకు వచ్చింది. దాన్ని తాగిన తరువాత "అమ్మ ఎక్కడ?" అని అడిగాడు.

"మహిళా మండలిలో ఏదో ప్రోగ్రాముందట...అందుకోసం తయారవుతున్నారు..." అంది వంటమనిషి.

పెన్సిలు కొనిపెట్టమని తల్లిని అడగాలనుకుని ఆమె గదిలోకి వెళ్ళాడు గోపీ.

డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని ముస్తాబవుతోంది కాంచన.

బారెడు జుట్టు నడినెత్తిమీదకు వచ్చేలా ఎత్తుగా ముడి వేసుకుంది. ఆ హెయిర్ స్టైల్ ఆశ్రమాలలో నివసించే మునికన్యకలదిలా ఉంది. కనుబొమ్మలు దిద్దుకోవడం పూర్తి చేసి, పెదవులమీద లిప్‌స్టిక్ పూసుకుంది. మెడలో ముత్యాల గొలుసు ధరించి, కట్టుకున్న జరీచీర తాలూకు అంచులు బాగా కనపడేలా సర్దుకుని, ఇంటిమేట్ సెంటు స్ప్రే చేసుకుంది.

"అమ్మా..." అన్నాడు గోపీ.

గోపీ వంక చిరాగ్గా చూసింది ఆమె.

"అబ్బబ్బ... ఎన్నిసార్లు చెప్పాలిరా...అమ్మా బొమ్మా అంటూ పాతకాలం పిలుపులు మానేసి నాజూగ్గా 'మమ్మీ' అంటూ పిలవమని?" అంది కోపంగా.

గోపీ చిన్నబుచ్చుకున్నాడు.

"ఆఁ... ఏమిటి విషయం?" అంది కాంచన.

"నాకు కొత్త పెన్సిలు కావాలి..."

"ఓస్...అంతే గదా...కొనుక్కో... సాయంత్రం నాన్నగారు వచ్చేక చెప్పు...నేను చాలా బిజీగా ఉన్నాను. ఈ రోజు సాయంత్రం నేను మురికివాడల్లో నివసిస్తున్న చిన్నపిల్లలు చదువుకునేందుకు వీలుగా పలకలు, బలపాలు, పుస్తకాలు, పెన్సిళ్ళు పంచాలి మా మహిళా మండలి తరఫున. నాకు టైమ్ అవుతోంది. నేను వెళుతున్నాను..." అంటూ ఒక వానిటీ బాగ్ చేతిలోకి తీసుకుని హైహీల్స్ టకటకలాడించుకుంటూ అక్కడ నుంచి కదిలింది ఆమె. కనుమరుగవుతున్న తల్లివంక చూస్తూండిపోయేడు గోపీ.

ఆమె ఆ పసివాడి తల్లి. అది పరసకు మాత్రమే. అతన్ని ఈ భూమిమీదకు తీసుకురావడం వరకే తన బాధ్యత అన్నట్లుగా అది మాత్రం నిర్వహించి ఊరుకుంది. ఆ తరువాత ఆ కుర్రవాడిని పెంచింది పనివాడే. ఒక్కసారి కూడా అనురాగంతో ఆ బాబును ఎత్తుకోలేదు. ఒక్కసారి ఆ కుర్రవాడిని ముద్దు పెట్టుకోలేదు. చనుబాలు ఇయ్యవలసిన సమయంలో కూడా అలా చేస్తే ఎక్కడ తన స్తన సౌందర్యం పాడవుతుందో అన్న భయంతో డబ్బా పాలు ఇప్పించింది. అలాంటి ఆమె ఈరోజు కొడుకు పెన్సిలు గురించి అడిగిన విషయం పట్టించుకోకుండా ఆ బాధ్యత మరొకరిమీదకు నెట్టి, మురికివాడలలో పిల్లలకు పెన్సిళ్ళు పంచే బృహత్కార్యం మీద చీరకు ఇంత సెంటు పులుముకుని వెళ్ళిపోయింది.

తల్లి వెళ్ళిపోయిన తరువాత హాల్లోకి వచ్చి విచారంగా కూర్చున్నాడు గోపీ.

"ఏం బాబూ...అలా ఉన్నావేం?" అంటూ పలకరించాడు రంగయ్య. అతను ఆ ఇంట్లో పనివాడు. గోపీని పెంచింది అతనే.

"ఏం లేదు రంగయ్య తాతా..." అన్నాడు గోపీ.

గోపీ ఎందుకో అదోలా ఉన్నాడని గ్రహించాడు రంగయ్య. గోపీలో ఉత్సాహం కలిగించాలని అతన్ని ఎత్తుకుని గిర్రున తిప్పి కితకితకితలు పెట్టాడు.

"పద బాబూ...లాన్‌లో ఆడుకుందాం..." అన్నాడు రంగయ్య.

"సరే..." అన్నాడు అన్యమనస్కంగా గోపీ.

ఇద్దరూ లాన్‌లోకి వచ్చారు. బంతి ఆడుకుంటూ కాస్సేపు గడిపారు. ఆడుతున్నాడన్న మాటేగానీ గోపీ మనసు పెన్సిలు మీదే ఉంది. ఈ రోజు కొత్త పెన్సిలు కొనుక్కుని రేపు తీసుకువెళ్ళకపోతే లెక్కల మాస్టారు ఎక్కడ కొడతారో అన్న భయం అతని మనసులో పేరుకుపోయింది.

"తాతా... నీ దగ్గర డబ్బులున్నాయా?" అడిగేడు.

రంగయ్య ఆశ్చర్యపోయాడు. గోపీ ఈ రకంగా ఎప్పుడూ అడగలేదు.

"ఏం చేస్తావు? చాక్లెట్ కావాలా?" అడిగేడు రంగయ్య.

అడ్డంగా తల ఊపాడు గోపీ.

"కాదు...పెన్సిలు కావాలి..."

రంగయ్య విచారంగా తల వంచుకున్నాడు. అతని దగ్గర కూడా డబ్బులు లేవు.

"లేవు బాబూ...కాస్సేపట్లో నాన్నగారు వస్తారు కదా...ఆయన్ను అడిగి మనిద్దరం బజారుకి వెళ్ళి కొని తెచ్చుకుందాం..." అన్నాడు రంగయ్య.

ఆ మాటలతో గోపీకి కొంచెం ప్రాణం లేచి వచ్చినట్లు అయింది.

చీకటి పడింది. గోపీ తండ్రి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు కానీ, ఆ జనకుడి జాడ లేదు. ఎనిమిది గంటలకు వంటమనిషి పిలిచి భోజనం పెట్టింది. తిని కాస్సేపు చదువుకున్నాడు. తొమ్మిదిన్నరకు కంటిమీద కునుకు వచ్చినా తల్లి కానీ, తండ్రి కానీ వస్తారని ఎదురు చూసి ఇక పది గంటలకు నిద్రకు ఆగలేక పడుకున్నాడు.

పదిన్నరకు అతని తండ్రి బుద్ధదేవ్ వచ్చాడు. అతను ఒక కంపెనీకి డైరెక్టర్. వ్యాపార పరమైన లావాదేవీల్లో చాలా బిజీగా ఉంటాడు. అతను, సాధారణంగా రాత్రి ఎనిమిది దాటిన తరువాతే ఇంటికి వస్తాడు. ఎప్పుడైనా ఏవైనా మీటింగులుంటే మరీ ఆలస్యంగా వస్తాడు. రోజుకు అయిదారు పేకెట్ల 'రెడ్‌విల్స్' సిగరెట్లు ఊదేస్తాడు. వారానికి రెండు, మూడుసార్లు మందు సేవిస్తాడు. ఆయన కూడా గోపీ గురించి పట్టించుకోడు. మంచి స్కూలులో జాయిన్ చేసినందుకు తన బాధ్యత తీరిపోయిందన్న ఉద్దేశంతో ఉంటాడు.

ఆ రోజు కూడా అతను తాగి వచ్చాడు.

"ఓ...గోపీ...అప్పుడే పడుకున్నాడా?" అన్నాడు.

"అప్పుడే ఏమిటి దొరా? పది దాటింది కదా!" అన్నాడు రంగయ్య.

"అమ్మగారు ఎక్కడ?"

జవాబు చెప్పాడు రంగయ్య.


"ఓ... వెరీగుడ్...మంచి పని చేస్తోంది కాంచన. మురికివాడల్లో పిల్లలు కూడా చదువుకోవడం చాలా అవసరం..." అన్నాడు బుద్ధదేవ్.

వంటమనిషితో భోజనం చెయ్యనని చెప్పి వెళ్ళి పడుకున్నాడు బుద్ధదేవ్. ఆ తరువాత మరొక అరగంటకు కాంచన వచ్చింది.

"ఓహ్...డామ్‌బోర్...మురికిపేటలు మరీ ఇంత ఘోరంగా ఉంటాయనుకోలేదు..." అంది వస్తూనే. భర్త గురించీ, కొడుకు గురించీ అడిగింది. అదే గొప్ప భాగ్యం!

వంటమనిషి భోజనం చెయ్యమంటే—"నో... అయామ్ డామ్ టైర్డ్... అన్నం తినే ఓపిక లేదు..." అని చెప్పి వెళ్ళి పడుకుంది.

ఆ మర్నాడు గోపీ నిద్ర లేచాడు. స్కూలుకి తయారైపోయాడు. అప్పటికి ఇంకా తల్లి గానీ, తండ్రిగానీ లేవలేదు. ఒకటి, రెండుసార్లు వెళ్ళి చూశాడు గానీ వాళ్ళింకా గుర్రుపెట్టి నిద్రపోతూ



కనిపించారు. ఒక పక్క స్కూలుకి టైమ్ అయిపోతోంది. ఇక ఆలస్యం చేయడానికి వీలులేక స్కూలుకి వెళ్ళిపోయాడు.

గోపీ పక్కనే కూర్చునే రాము దగ్గర రెండు పెన్సిళ్ళు చూశాడు గోపీ. లెక్కల మాస్టారు కొట్టకుండా ఉండాలంటే ఏం చేయాలో తోచింది. అంతే! పెన్సిలు ఒకటి సొంతం చేసుకున్నాడు.

** ** **

పరమేష్ఠిగారు తల పంకించారు. గోపీని దగ్గరకు తీసుకున్నారు.

"గోపీ...నువ్వు ఏ పరిస్థితుల్లో ఈ పని చేశావో నేను తెలుసుకున్నాను. అయినా కూడా తప్పు తప్పే. ఎలాంటి పరిస్థితుల్లో అయినా మనిషి తప్పు చేయకూడదు. తప్పు చేయడానికి అలవాటు పడ్డవాడు అలాగే తప్పులు చేస్తూ ఉంటాడు..." అన్నారు.

గోపీ తల వంచుకున్నాడు.

"నన్ను క్షమించండి సార్! ఇంకెప్పుడూ అలా చేయను..." అన్నాడు. గోపీ గొంతులో నిజమైన పశ్చాత్తాపం!

"శభాష్ గోపీ...ఈ మాట నిలబెట్టుకో..." అన్నారు పరమేష్ఠిగారు గోపీ భుజం తడుతూ.

"అలాగే సార్!" అన్నాడు గోపీ.

"నీకు పెన్సిలు లేదు కదూ... రాము పెన్సిలు అతనికి ఇచ్చెయ్యి. నీకు నేను ఒక పెన్సిలు బహుమతిగా ఇస్తాను. తీసుకో..." అంటూ డ్రాయర్‌లోంచి ఒక పెన్సిలు తీశారు ఆయన

"మీరు ఇయ్యక్కర్లేదు సార్...గోపీ నా దగ్గర నుంచి తీసుకున్న పెన్సిలు నాకు ఇయ్యక్కర్లేదు. అతన్ని ఉంచుకోనియ్యండి" అన్నాడు రాము.

పరమేష్ఠిగారు ఆశ్చర్యంగా రాము వంక చూశారు.

"అవును సార్! గోపీ దొంగతనంగా తీసుకున్నాడని అతనితో దెబ్బలాడాను. అతను కావాలని అడిగితే నేనే ఇచ్చి ఉండేవాడిని" అన్నాడు రాము.

"రామూ ! శభాష్... నిన్ను చూసి నేను గర్వపడుతున్నాను..." అన్నారు పరమేష్ఠిగారు.

"థాంక్యూ రామూ ..." అన్నాడు గోపీ.

కాస్సేపటి క్రితం బద్ధశత్రువుల్లా కొట్టుకున్నారు. ఇప్పుడు ఆప్తమిత్రులైపోయారు. చిన్నపిల్లల్లో ఉన్న ప్రత్యేకత ఇదే కాబోలు!

"సరే...వెళ్ళిరండి..." అన్నారు పరమేష్ఠిగారు.

ఆ పిల్ల లిద్దరూ గురువుగారికి నమస్కారం చేసి వెళ్ళిపోయారు. పరమేష్ఠిగారు టెలిఫోన్ డైరెక్టరీ తీసి ఒక నంబరు చూసి ఆ నంబరుకి ఫోన్ చేశారు. లైన్లోకి బుద్ధదేవ్ రాగానే—"హలో బుద్ధదేవ్‌గారూ! నమస్తే...మీ గోపీ చదువుతున్న స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేష్ఠిని మాట్లాడుతున్నాను. మీతో అర్జంటుగా...చాలా అర్జంటుగా ఈ రోజే ఒక విషయం మాట్లాడాలి. పది నిముషాలు స్పేర్ చేసినా చాలు. ఆ సమయంలో మీ భార్యగారు కూడా ఉంటే మంచిది. ఏమంటారు?" అన్నారు పరమేష్ఠి.

"ఓకే...రాత్రి ఎనిమిది గంటలకు మా ఇంటికి రండి..." అన్నాడు బుద్ధదేవ్.

"థాంక్యూ..." అన్నారు పరమేష్ఠి ఫోను పెట్టేస్తూ.

** ** **

రాత్రి ఎనిమిది గంటలకు పరమేష్ఠిగారు బుద్ధదేవ్ ఇంటికి వెళ్ళారు. హాల్లో కూర్చుని గోపీ సైన్సు చదువుకుంటున్నాడు. పరమేష్ఠిగార్ని ఆ సమయంలో చూసి ఆశ్చర్యపోయి "నమస్తే సార్..." అన్నాడు.

"ఏం గోపీ చదువుకుంటున్నావా?... మంచిది" అన్నారు ఆయన. గోపీ ఎందుకో సిగ్గుపడిపోయాడు.

రంగయ్య చెప్పిన కబురు అందుకుని లోపల్నుంచి బుద్ధదేవ్, కాంచన వచ్చారు.

"నమస్తే...మీరేనా డాక్టర్ పరమేష్ఠి?" అన్నాడు బుద్ధదేవ్.

"అవును...నమస్తే..." అన్నారు పరమేష్ఠి. కాంచన కూడా నమస్కరించింది.

"గోపీ... నువ్వు లోపలకు వెళ్ళి చదువుకో..." అన్నారు పరమేష్ఠి. గోపీ వెళ్ళిపోయాడు.

"కూర్చోండి..." అన్నాడు బుద్ధదేవ్.

పరమేష్ఠిగారు కూర్చున్నారు. ఆ ఎదురుగా సోఫాలో బుద్ధదేవ్, కాంచన కూర్చున్నారు.

వంటమనిషి లోపలినుంచి కాఫీలు, బిస్కట్లు తెచ్చి టిపాయ్‌మీద ఉంచింది.

"ఎందుకండీ ఇవన్నీ?" అంటూ మొహమాటపడ్డారు పరమేష్ఠి.

చిర్నవ్వుతో—"ఫర్వాలేదు. తీసుకోండి..." అంది కాంచన.

సిగరెట్ ముట్టించాడు బుద్ధదేవ్.

"ఏమిటి విషయం? చెప్పండి... మాగోపీ బాగా చదువుతాడా? బుద్ధిమంతుడేనా?" అన్నాడు బుద్ధదేవ్.


పరమేష్ఠిగారు చిన్నగా నవ్వారు. "హి ఈజ్ ఎ గుడ్ బాయ్..." అన్నారు.

"నాకు మహిళా మండలి మీటింగ్ ఉంది. నన్నూ ఉండమన్నారట గదా...ఆయన ఫోను చేసి చెప్పారు. ఆ మీటింగ్ కాన్సిల్ చేశాను...మీ కోసం..." అంది కాంచన.

"మంచి పని చేశారు..." అన్నారు పరమేష్ఠి.

"చెప్పండి..." అన్నాడు బుద్ధదేవ్.

గోపీ స్కూల్లో పెన్సిల్ దొంగతనం చేయడం



ఉదయం చేతులు చాచి
చీకటిదుప్పటి తొలగిస్తే
ఒళ్ళు విరుచుకుంటుంది రోడ్డు-
బండివాడు విసిరేసిన ఇడ్లీ ముక్క
ఫ్లాస్కుడ్రాడు జార్చిన టీ చుక్క
రోడ్డు అల్పాహారం-
ఫుట్‌పాత్ జీవితాలు
నిన్నటి పేపర్లో మంత్రిచేసిన
మొన్నటి వాగ్దానాన్ని కప్పుకుంటాయి-
సెకిళ్ళ పొదుగుల్లోంచి
వార్తలు ప్రవహిస్తాయి

ప్రసేన్

గురించి టూకీగా చెప్పారు ఆయన.

బుద్ధదేవ్ ముఖం కోపంతో ఎర్రబడింది. కాంచనలో ఆవేశం పొంగింది.

"ఎంత ఘోరం...ఇంత పని చేస్తాడా? వాడి తోలు ఒలుస్తాను...ఇక ముందు ఎన్నడూ అలాంటి వెధవ పనులు చేయకుండా ఒళ్ళు చీరేస్తాను..." అన్నాడు బుద్ధదేవ్.

"మై గాడ్...వాట్ ఎ గ్రేట్ న్యూ సెన్స్! వాడు నా కడుపున చెడబుట్టాడు. వాడికి ఏం లోటని ఈ వెధవ పనికి పూనుకున్నాడు? వాళ్ళ నాన్నగారు రెండు చేతులతో సంపాదిస్తున్నారు..." అంది కాంచన. ఆ దంపతుల వంక శాంతంగా చూశారు పరమేష్ఠి.

"నాకు తెలుసు ఈ రకంగా మీరు ఆవేశపడతారని. అందుకనే నేను స్వయంగా వచ్చాను. లేకుంటే ఉదయం ఫోనులో ఈ విషయం చెప్పి ఊరుకునేవాడిని. గోపీ దొంగతనం చేయడానికి కారణం మీరు..."

బుద్ధదేవ్, కాంచన ఒకేసారి ఉలిక్కిపడ్డారు.

"మేమా?" అంది కాంచన.

"అవునమ్మా! బిడ్డలకు తిండి, బట్ట ఇచ్చి, మంచి స్కూల్లో చేర్పించేసినంత మాత్రాన్న తల్లితండ్రుల బాధ్యత తీరిపోదు. ఆ బిడ్డల అవసరాలు ఏమిటో అనుక్షణం కనిపెట్టుకుని ఉండి, ఆ అవసరాలు తీరుస్తూ ఉంటేనే తల్లితండ్రులు తమ బాధ్యత నిర్వర్తించినవారు అవుతారు. గోపీకి పెన్సిలు అవసరం. ఆ అవసరం మీ ఇద్దరిలో నిన్న ఏ ఒక్కరు తీర్చినా ఈ రోజు గోపీ దొంగతనం చేయవలసిన అవసరం ఉండేది కాదు."

ఆ దంపతు లిద్దరూ ఆలోచిస్తూ ఉండిపోయారు.

"అత్యవసరంగా నేను మహిళా మండలి పనిమీద నిన్న సాయంత్రం వెళ్ళవలసి వచ్చింది...అందుకే..." అంది కాంచన.

"అవును. ఈ రోజు కూడా మీకు మీటింగుంది. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక పని ఉంటుంది మీకు. ఆ పనులు మానుకోమని చెప్పటం లేదు నేను. గోపీ నిన్న మిమ్మల్ని పెన్సిలు గురించి అడిగినప్పుడు అందుకు కావలసిన డబ్బులు ఏ నౌకరుకో ఇచ్చి తెప్పించి ఉండవలసింది. మీ దగ్గర ఆ మాత్రం డబ్బు ఉంటుంది కదా!" అన్నారు పరమేష్ఠి.

"ఆఁ... వందలకు వందల డబ్బు నా వేనిటీ బేగ్‌లో ఎప్పుడూ ఉంటుంది..." అంది కాంచన అహంకారం ధ్వనిస్తుండగా.

"అవును... అందులోంచే పెన్సిలు కోసం ఒక్క రూపాయి ఇయ్యవచ్చు కదా!"

బుద్ధదేవ్ కలిపించుకున్నాడు.

"ఊఁ... పది డజన్ల పెన్సిళ్ళు కొని ఇంట్లో పెడతాను. ఇక సమస్య ఉండదు..."

"అబ్బే... అంత మాత్రాన సమస్య పోతుందని అనుకోను. మరొక రోజు గోపీకి నోట్‌బుక్ అవసరం కావచ్చు. ఇంకో రోజు రబ్బరు అవసరం కలగవచ్చు. ఎన్నని కొని పెడతారు? ప్రతీ రోజూ బిడ్డ స్కూలు నుంచి రాగానే ఆ రోజు ఏం పాఠాలు అయ్యాయి, ఆ మర్నాడు చూపించవలసిన హోమ్‌వర్కు ఏమిటి. ఆ మర్నాడు స్కూలుకి ఏమేం కావాలి అన్న విషయాలు చూడటం తల్లితండ్రుల బాధ్యత. స్కూల్లో టీచర్లు పాఠాలు చెబుతారు కదా అని ఇక ఏమీ పట్టించుకోకుండా

ఉండకూడదు. బిడ్డను తీర్చిదిద్దవలసింది తల్లితండ్రులే. ఆ తరువాతే గురువు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ అని అన్న తరువాతే కదా ఆచార్య దేవోభవ అన్నది!"

వరమేష్ఠిగారి పలుకులను అతి శ్రద్ధగా వింటున్నారు ఆ ఇద్దరూ. బుద్ధదేవ్ ఒక సిగరెట్ వెలిగించాడు.

"మీరు తాగే ఈ రెడ్‌విల్స్ సిగరెట్లు రెండు కలిపితే బహుశా ఒక పెన్సిలు విలువ. అవునా?"

బుద్ధదేవ్ తల వంచుకున్నాడు.

"ఛ...డబ్బుది ఏముంది? నా కొడుక్కి కావాలంటే ఏనుగును కూడా కొని పెట్టగలను నేను..." అన్నాడు బుద్ధదేవ్.

"మీ అబ్బాయికి కావలసినవి ఏనుగులు, గుర్రాలు కాదు. అవసరం వచ్చినప్పుడు ఒక పెన్సిలు. అందుకే చెపుతున్నాను. బిడ్డకు కావలసినది ఏమిటో తెలుసుకుని ఆ అవసరాలు తీర్చడం తల్లితండ్రుల బాధ్యత. బిడ్డ గురించి పూర్తిగా పట్టించుకోవలసింది తల్లే అని చాలామంది తండ్రులు అభిప్రాయపడుతూ ఉంటారు. అది చాలా తప్పు. ఈ విషయంలో తండ్రి బాధ్యత కూడా ఉంది. దాన్ని విస్మరించకూడదు. ఆడదానికి దొరికినంత తీరిక మగవాడికి దొరకకపోవచ్చు. అయినా కూడా కనీసం వారానికి ఒక్కసారైనా బిడ్డను దగ్గర కూర్చోబెట్టుకుని ఆ బిడ్డ ఎలా చదువుతున్నాడు, ఏఏ సబ్జక్టులలో తక్కువ మార్కులు వస్తున్నాయి, అలా వస్తే ఏ రకంగా వృద్ధి చేసుకోవాలి అన్న విషయాలు తండ్రులు పట్టించుకోవాలి..."

వరమేష్ఠిగారి పలుకులు సూదుల్లా తాకాయి బుద్ధదేవ్ గుండెకు. అందుకే కాబోలు అతను తల వంచుకున్నాడు. వరమేష్ఠిగారు మళ్ళీ అన్నారు.

"పసిబిడ్డ మనసు సారవంతమైన భూమిలాంటిది. అందులో ఏ రకమైన 'బీజం' నాటాలి—అన్నది తల్లితండ్రులు చేయవలసిన పని. అమృతఫలాల్ని ఇచ్చే మంచి బీజం నాటితే ఆ బిడ్డ పెద్దవాడైన తరువాత ఒక ఉత్తమ పౌరుడిగా, మంచి ఆదర్శపురుషుడుగా తయారవుతాడు. ఈ పని చేయాలంటే తల్లితండ్రులు అనుక్షణం బిడ్డ గురించి పట్టించుకుంటూ ఉండాలన్న మాట! ఆ బిడ్డను ఏ రకంగానూ పట్టించుకోక అలక్ష్యం చేస్తే ఆ బిడ్డ మనసులో చేదుపళ్ళు ఇచ్చే బీజం నాటుకుపోతుంది. దాని ఫలితంగా ఆ బిడ్డ పెద్దవాడైన తరువాత సమాజానికి చీడపురుగు అవుతాడు. చెడు మార్గంలో పయనిస్తూ ఈ భూమికే బరువవుతాడు. గోపీ అలా కాకూడదు. అందుకే నేను ఇంతగా తాపత్రయ పడుతున్నాను. కేవలం నేను ఇలా తాపత్రయ పడటంవల్లనే కార్యం సానుకూలం కాదు. తల్లితండ్రులుగా మీరు చేయవలసింది కూడా చేయాలి."

బుద్ధదేవ్ కళ్ళముందు చీకటి తెరలు తొలగిపోయాయి. కాంచన అజ్ఞానం ఆమె నుంచి దూరమైంది.

"క్షమించండి...మా తప్పు తెలుసుకున్నాం. గోపీ ఒక ఉత్తమ పౌరుడిగా మారడానికి మావంతు కృషి చేస్తాం" అన్నాడు బుద్ధదేవ్.

"నా కళ్ళు తెరిపించారు. గోపీ కన్నా మాకు ఎక్కువ ఏదీ కాదు. ఇక ముందు నేను వాడిని అనుక్షణం కనిపెట్టుకుంటాను. ఇందుకోసం అవసరం అయితే నా మహిళా మండలి కార్యక్రమాలు తగ్గించుకుంటాను..." అంది కాంచన.

వరమేష్ఠిగారు ఆనందంతో పొంగిపోయారు. ఆయన వచ్చిన పని సఫలం అయింది.

"నా మాటలు మీకు కష్టం కలిగించి ఉండొచ్చు. అందుకు మన్నింపు కోరుతున్నాను." అన్నారు వరమేష్ఠిగారు.

"ఇందులో మన్నింపు కోరటం అనవసరం. మీరు చాలా గొప్ప పని చేశారు. తప్పు చేస్తున్న వ్యక్తులు అజ్ఞానంలో అది తప్పు అని కూడా గ్రహించలేకపోతుంటే ఆ విషయం తెలియచెప్పటమే కాక, ఇక ముందు ఆ తప్పు జరగకుండా చేశారు. అందుకు మేం మీకు ఋణపడి ఉన్నాం..." అన్నాడు బుద్ధదేవ్.

"అవును...మీలాంటివారు ఊరికి ఒకరున్నా బాలబాలికల భవిష్యత్తు ఉజ్జ్వలం కాగలదు..." అంది కాంచన.

వరమేష్ఠిగారు లేచారు. "వస్తాను. సెలవు..." అంటూ చేతులు జోడించారు.

బుద్ధదేవ్, కాంచనలు కూడా లేచి నిలబడి ఆయనకు నమస్కారం చేసి గేటువరకూ ఆయన్ని సాగనంపి వచ్చారు.

ఆ దంపతుల వైఖరిలో మార్పు వచ్చింది. బిడ్డ జీవితం బాగుపడటం కోసం కంకణం కట్టుకున్నారు. ఆకాశంలో చంద్రుడు కాంతివంతంగా ప్రకాశిస్తున్నాడు. ఆ కాంతి జ్ఞానానికి చిహ్నం.

★

